తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
ఆదివారం
25 అక్టోబర్ 2026
Follow :


# ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తాగునీటి సంరక్షణకు ప్రాధాన్యం
- ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి

**ఆత్మకూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక, మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. శనివారం ఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎనిమిది నెలలు అత్యంత కీలకమని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావంతో గ్రామాల్లో చెరువులు ఎండిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని, నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని కోరారు. ప్రైవేటు వ్యక్తుల బోర్లలో తాగునీరు అందుబాటులో ఉన్నా, ప్రభుత్వం తరఫున నీటిని కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారులు రైతులకు పంటల ఎంపిక, సాగు ప్రణాళిక, నీటి వినియోగంపై తగిన అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే పరిస్థితులపై ప్రజలకు స్పష్టంగా వివరించి, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, క్లిష్ట పరిస్థితుల్లోనూ రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భరోసా ఇచ్చారు.

రైతులకు, గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.






ఎల్‌నినో ప్రభావం మనుషులపైనే కాకుండా పశుపక్షాదులపైనా పడే అవకాశం ఉన్నందున వాటి సంరక్షణకు కూడా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కోవడంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకుని, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తే రాబోయే సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

**పేదల సొంతింటి కలను సహకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం: మంత్రి వాకిటి శ్రీహరి...**

పేదల సొంతింటి కలలో సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని అమలు చేసిందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఆత్మకూరు మండలంలో 35 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలని సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు ,ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు, ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు,ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ కీమ్యా నాయక్, ఆర్ డి ఓ సుబ్రహ్మణ్యం, ఎమ్మార్వో చాంద్ పాషా, ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రేహమతుల్లా, మున్సిపల్ చైర్మన్ జి నాగమణి, వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు, డిసిసి జిల్లా కార్యదర్శి తులసి రాజ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగేష్, టౌన్ అధ్యక్షులు ఇర్ఫద్దిన్నె శ్రీనివాసులు, కౌన్సిలర్లు కోఆప్షన్లు,అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన అసిస్టెంట్ సైంటిస్ట్ పరీక్ష

- పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ (విశ్లేషకుడు గ్రేడ్-2) పోస్టుల భర్తీకి శనివారం నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పాండు తనిఖీ చేశారు. అభ్యర్థుల హాజరు, వేలిముద్రల ద్వారా హాజరు నమోదు, నిఘా కెమెరాల పనితీరును పరిశీలించారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చేపట్టిన భద్రతా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులను లోహ తనిఖీ పరికరాలతో తనిఖీ చేసిన తర్వాతే కేంద్రంలోకి అనుమతించడం, సెల్‌ఫోన్లు, స్మార్ట్ గడియారాలు సహా ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష గదుల్లోకి అనుమతించకుండా చర్యలు తీసుకోవడంపై ఆరా తీశారు. అభ్యర్థులకు తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కమిషన్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పరీక్షను సజావుగా నిర్వహించాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఈ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో నిర్వహించగా, మొత్తం 150 మంది అభ్యర్థులకు గాను 89 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

## చేనేత, జౌళి శాఖ
# సహాయ సంచాలకులుగా రంజిత్ బాధ్యతల స్వీకరణ



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మహబూబ్‌నగర్ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులుగా జె. రంజిత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు శాఖ కమిషనర్ కార్యాలయంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆయనకు పదోన్నతి కల్పిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడం, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ ప్రయోజనాలు అందించడం, చేనేత రంగ అభివృద్ధికి కృషి చేయడం తన ప్రాధాన్యతలని రంజిత్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాఖ పరిపాలనా అంశాలు, కార్యక్రమాల అమలుపై కలెక్టర్‌కు వివరించారు.

# యువజన సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

- అక్టోబర్ 27లోపు దరఖాస్తు అవకాశం
- జిల్లా యువజన, క్రీడల అధికారి టి.అఖిలేశ్ రెడ్డి


మిగతా 10లో..


**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2027లో భాగంగా 30వ జాతీయ యువజన ఉత్సవాల ప్రాథమిక ఎంపిక కోసం సంగారెడ్డి జిల్లాలో ఈ నెల 29న జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి (ఎఫ్‌వీసీ) టి. అఖిలేశ్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జానపద నృత్యం, జానపద గీతం, చిత్రలేఖనం, వీధి నాటకం, కవితా రచన విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన వారు నవంబర్ లేదా డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. జాతీయ స్థాయి పోటీలు 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్నారు.

**అర్హతలు, నిబంధనలు ఇవీ...**

15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, సంగారెడ్డి జిల్లాలో నివసిస్తున్న లేదా చదువుకుంటున్న యువతీ యువకులు అర్హులు. పోటీల్లో పాల్గొనేవారు తప్పనిసరిగా మై భారత్ (వీ దీప్యుతీఫ్) పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి. గత మూడేళ్లలో జాతీయ యువజన ఉత్సవాల్లో పాల్గొన్నవారు అర్హులు కారు. ఒక్కొక్కరు ఒక విభాగంలో మాత్రమే పాల్గొనాలి.

జానపద నృత్యం, జానపద గీతాల విభాగాల్లో గరిష్ఠంగా 10 మంది చొప్పున పాల్గొనవచ్చు. ప్రదర్శన సమయం 5 నుంచి 8 నిమిషాలు. సహాయక సిబ్బంది వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలి. చిత్రలేఖనం కోసం గరిష్ఠంగా ఆరు గంటల సమయం

# పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం


మిగతా 8లో..




**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 24 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ప్రమాద బాధితులకు ప్రాణాపాయం నుంచి రక్షణ కల్పించేందుకు తక్షణ వైద్య



సహాయం అందించాలని సూచించారు. పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల పాటు ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే ప్రమాద కేసులను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, బాధితుల వివరాల ధ్రువీకరణకు పోలీసులు వెంటనే స్పందించాలని ఆదేశించారు. వాహనాలు బీమా పరిధిలో ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం చికిత్స ఖర్చులను బీమా సంస్థల ద్వారా ఆసుపత్రులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆసుపత్రులు సమర్పించే చికిత్స ఖర్చుల క్లెయిమ్‌లను కలెక్టర్లు పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆమోదించాలని సూచించారు. ఆమోదించిన క్లెయిమ్‌లను చెల్లింపుల కోసం సంబంధిత ఆర్థిక నిర్వహణ పోర్టల్‌కు పంపించి, ఆసుపత్రులకు నిధులు సకాలంలో అందేలా పర్యవేక్షించాలని తెలిపారు.

# ఎల్‌నినో ముప్పు.. నీటి సంరక్షణకు పటిష్ట చర్యలు




- తాగునీటి వృథాను అరికట్టాలి.. లీకేజీలను వెంటనే సరిచేయాలి
- వీబీజీ రామ్‌జీ పనుల్లో పనిదినాలు పెంచాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి





**వనపర్తి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వచ్చే ఏడాది జూలై వరకు జిల్లాలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, తాగునీటి వృథాను అరికట్టి ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో వెబ్‌ఎక్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీటి సరఫరా, వీబీజీ రామ్‌జీ పథకం పనులు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్ సమీక్షించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 30 వరకు మిషన్ భగీరథ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో పైపులైన్ల లీకేజీలను వెంటనే సరిచేయాలని ఆదేశించారు. వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక నీటి వనరులను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు అవసరమైన చోట్ల ప్రైవేటు బోర్లను అందుబాటులోకి తేవాలని సూచించారు.

**వీబీజీ రామ్‌జీ పనుల్లో లక్ష్యాలు సాధించాలి...**

వీబీజీ రామ్‌జీ పథకంలో కూలీలకు పనిదినాల కల్పనలో పురోగతి తక్కువగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. పనిదినాలు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో కూలీలను సమీకరించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఫామ్ పాండ్స్, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించే పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షిస్తామని, అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు...**

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రూఫ్ రీప్లేస్‌మెంట్‌కు ఒక్కో నియోజకవర్గానికి 500 మంది లబ్ధిదారులను కేటాయించనున్నట్లు తెలిపారు. అర్హులను మండలాల వారీగా గుర్తించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఎంపిక చేయాలని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్డీవో ఉమాదేవి, మిషన్ భగీరథ ఎస్ఈ, హౌసింగ్ పీడీ విఠోబా, సీపీఓ హరికృష్ణతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి





**సిర్గాపూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలం సంగెం గ్రామ సర్పంచ్ గారి కుటుంబ సభ్యులపై కొందరు దాడులకు పాల్పడి వారిని తీవ్రంగా గాయపరచడంతో నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి .మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... బాధితులు రతన్ నాయక్, పండరి, రంగుబాయి, సంతుబాయి, గీత బాయి తీవ్రంగా కొట్టి గాయపరిచిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని, వారికి చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు త్వరగా న్యాయం చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు.వారితోపాటు సర్పంచ్ భూపాల్, మాజీ ఎంపీటీసీలు ముజామిల్, శ్రీనివాస్ పటేల్ తదితరులు ఉన్నారు.

## వీర హనుమాన్ ఆలయంలో ఘనంగా సింధూర పూజలు



**కల్హేర్, అక్టోబర్ 25 (జనంసాక్షి):** కల్హేర్ మండల కేంద్రం సమీపంలోని స్వయంభూ వీర హనుమాన్ ఆలయంలో దుర్గామాత సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సింధూర పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, యువకులు స్వామివారి విగ్రహాన్ని కుంకుమ, సింధూరంతో అలంకరించగా, పూజారి వేదమంత్రాలతో పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ఆపదల నుంచి స్వామివారు కాపాడాలని ప్రార్థించినట్లు సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి: మున్సిపల్ వైస్ చైర్మన్ రేణుక చిరు



**సదాశివపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరు సూచించారు. పట్టణంలోని 3వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నల్లాకు ట్యాప్‌లు బిగించే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీటిని వృథా చేయకుండా నల్లాలకు ట్యాప్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలు, రోడ్లు, వాకిళ్లు కడగడానికి నీటిని వృథా చేయవద్దని కోరారు. త్వరలో పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ నల్లాలకు ట్యాప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో భరత్, ఉదయ్, నితిన్, మాణిక్, దిలీప్, లాజర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీబీపేట్ గ్రామ పంచాయతీ తాళం పగులగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

- పోలీస్ స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు

**కల్హేర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** కల్హేర్ మండలం బీబీపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయ తాళం పగులగొట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి రంగయ్య కల్హేర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దసరా పండుగ రోజు రాత్రి గ్రామంలో జరిగిన గొడవలో నల్లవాగుకు చెందిన కొందరు వ్యక్తులు పంచాయతీ కార్యాలయ తాళం పగులగొట్టి, అక్రమంగా లోపలికి ప్రవేశించి హంగామా సృష్టించినట్లు స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయమైన గ్రామ పంచాయతీ ఆఫీస్ తాళం పగులగొట్టడం, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని, కావున బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు.

## ఆరుతడి పంటలు సాగు చేయండి

- వరికి బదులు శనగ, పెసర, మినుము వేస్తేనే లాభం - వ్యవసాయ శాఖ



**సిర్గాపూర్ అక్టోబర్ 24 (జనంసాక్షి):** రానున్న యాసంగి సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.శనివారం సిర్గాపూర్‌లో ఏడీఏ ప్రవీణ్ చారి, ఎంఏఓ హరికృష్ణ వరి పొలాలను పరిశీలించారు. తక్కువ నీటితో పండే శనగలు, పెసర, మినుము వంటి పప్పుధాన్యాలు సాగుచేసి లాభాలు పొందాలని కోరారు. పర్యటనలో ఏఈఓలు, వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## కొరటికల్‌లో భారీ చోరీ..

- 10 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు అపహరణ



**ఉప్పునుంతల, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మండలంలోని కొరటికల్ గ్రామంలో భారీ చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన వృద్ధ దంపతుల ఇంట్లోకి గుర్తుతెలియని దొంగలు చొరబడి 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదును అపహరించారు.

గ్రామానికి చెందిన గోపిరెడ్డి భారతమ్మ (70), భర్త బచ్చిరెడ్డి (75) ఈ నెల 23న దిండి గ్రామంలో వ్రతానికి వెళ్లారు.

24న ఇంటికి తిరిగివచ్చి చూడగా, ఇంటి వెనుక కిటికీ చెక్కలు పగలగొట్టి, ఇనుప రాడ్లు వంచి దొంగలు లోపలికి ప్రవేశించినట్లు గుర్తించారు. బీరువా, డ్రాయర్లు తెరిచి ఉండటంతో పాటు బంగారు చంద్ర హారం, కంకణాలు, నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ఈ సందర్భంగా ఎస్సై పుట్ట మహేష్ మాట్లాడుతూ, ప్రజలు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలువైన ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## చాకరిమెట్లలో ఘనంగా శనీ త్రయోదశి పూజలు



**శివ్వంపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** శనీ త్రయోదశిని పురస్కరించుకుని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయానికి ఉమ్మడి జిల్లా, జంట నగరాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిట్కుల్ మహిపాల్ రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. చందన పూజ, అభిషేకం, అర్చన, ఆకుపూజ తదితర పూజలు చేశారు. అనంతరం సత్యనారాయణ స్వామి, మహాగణపతి, సరస్వతి మాత, సీతారాములను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

## హృసికేష్‌కు ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటాలో సీటు



**కొత్తపల్లి అక్టోబర్ 24 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కొత్తపల్లి గ్రామానికి చెందిన కావలి ఆనందం టీచర్ కుమారుడు కావలి హృసికేష్‌కు ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సులో కన్వీనర్ కోటా కింద సీటు లభించడం గ్రామానికి గర్వకారణమని కొత్తపల్లి ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలోని హృసికేష్ స్వగృహంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ ముదిరాజ్, కావాలి రాములు, నర్సింహులు, కనకప్ప, కె. శ్రీనివాస్, కావాలి రాంచందర్ తదితరులు పాల్గొని హృసికేష్‌ను అభినందించారు.

## దుర్గమ్మ గుడి నిర్మాణానికి విరాళం



**చేర్యాల, అక్టోబర్ 24 (జనంసాక్షి):** దుర్గమాత నిమజ్జనం అనంతరం మిగిలిన నగదు రూ.10,116లను దుర్గమ్మ గుడి నిర్మాణం కోసం శనివారం హిందూ వాహిని యూత్ (టీం కామన్) సభ్యులు విరాళంగా అందజేశారు. వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా దుర్గమాత ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

## ఇందిరానగర్‌లో
## ప్రారంభమైన వడ్ల కొనుగోలు కేంద్రం



**కల్హేర్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** కల్హేర్ మండలం ఇందిరానగర్ గ్రామపంచాయతీ పరిధిలో శనివారం వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించార. శాసనసభ్యులు శ్రీ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాల మేరకు ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రైతులు పండించిన వడ్లకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, దళారుల బెడద లేకుండా ప్రభుత్వ మద్దతు ధర అందించేందుకు ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, తేమ శాతం ప్రకారం న్యాయమైన ధర అందించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు తమ వడ్లను ఆరబెట్టి, శుభ్రం చేసి కేంద్రానికి తీసుకురావాలని కోరారు.

## భవానీమాత
## ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**సిర్గాపూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** సిర్గాపూర్ మండలం సర్పంచ్ తండలోని భవానీమాత ఆలయ నిర్మాణానికి జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గుబ్బ మచ్చేందర్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందిన ఆయన, గ్రామాల్లో దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారు. భక్తి, సేవాభావంతో ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన మచ్చేందర్‌ను తండవాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బసవరాజు పటేల్‌తో పాటు గ్రామానికి చెందిన పలువురు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## చేపల వలలో చిక్కుకుని వ్యక్తి మృతి

- **రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్**
- **మరుసటి రోజు చెరువులో శవమై కనిపించిన వైనం**



**కౌడిపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బతుకమ్మ తండాకు చెందిన అజ్మారా శ్రీనివాస్ (53) చెరువులో మృతి చెందాడు. అక్టోబర్ 23న రాత్రి భోజనం అనంతరం బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. మట్టి పల్లె చెరువు వద్ద రుమాలు కనిపించడంతో అనుమానంతో మరుసటి రోజు ఉదయం చెరువులో పరిశీలించగా, చేపల వలలో చిక్కుకుని మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య సాయమ్మ ఫిర్యాదుతో ఎస్ఐ అమరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై ఎవరి మీదా అనుమానం లేదని ఆమె తెలిపారు.

## నిర్విఘ్నంగా యాగం
## కొనసాగేందుకు సహస్ర మోదక హవనం



**శివ్వంపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** లోక కల్యాణం, భక్తుల ఆయురారోగ్య ఐశ్వర్యాల అభివృద్ధి కోసం శివ్వంపేటలోని బగలాముఖీ శక్తిపీఠంలో ఈ నెల 25న నిర్వహించనున్న అష్టోత్తర శత కుండ బగలాముఖీ మూలమంత్ర మహాయాగం నిర్విఘ్నంగా సాగాలని శనివారం సహస్ర మోదక హోమం నిర్వహించారు.
ప్రముఖ వేద పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య గణపతి అనుగ్రహం కోసం పూజలు చేపట్టారు. శక్తిపీఠ వ్యవస్థాపకులు శాస్త్రుల లక్ష్మీ వెంకటేశ్వర శర్మ దంపతులు, అర్చన వివేక్ శర్మతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన వేద పండితులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

- **పంట నష్టానికి ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలి**
- **రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం.. ప్రభుత్వాన్ని నిలదీస్తాం**



**కొల్చారం, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కొంగోడు, అంశానిపల్లి, వసురం తండా, కొల్చారం, వరిగుంతం, పోతంశెట్టిపల్లి, అప్పాజీపల్లి, సంగాయిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్యాయం చేస్తోందని విమర్శించారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా లేక రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.
అనంతరం అంశానిపల్లి, నాయిని జలాల్పూర్ గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల వద్ద కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. నాయిని జలాల్పూర్ మాజీ సర్పంచ్ తనయుడు కర్రె పెద్ద సంజీవులుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస చారి, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుమలత, ఏఈఓ గౌతమి, జీపీఓలు సత్యనారాయణ, పద్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్తా, పార్టీ ముఖ్యనాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, మండల యువత విభాగం అధ్యక్షులు తుంకులపల్లి సంతోష్ రావు, సొసైటీ



చైర్మన్లు నాగూరి మనోహర్, చిన్నారపు ప్రభాకర్, పిఏసిఎస్ ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్ , సర్పంచులు దుబ్బ గళ్ళ స్వామి, పుట్ల గళ్ళ మోహన్, ఉప సర్పంచ్ బాంచ వీరేశం, వార్డు సభ్యులు, పి ఎ సి ఎస్ డైరెక్టర్లు వడ్ల శ్రీనివాస్ చారి, చాకలి ఏసు, సాయనోళ్ళ సాయిలు, బేగరి రాములు, అల్లాపురం బూదమ్మ, మాజీ డైరెక్టర్ అచ్చన్న పల్లి నర్సింలు, గ్రామ పెద్దలు కమ్మరి పాండరీ, సాజిద్ ఖాన్ ,పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్హేర్ కేంద్రంలో
## ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**కల్హేర్, అక్టోబర్ 24(జనంసాక్షి):** కల్హేర్ మండల కేంద్రంలోని వ్యవసాయ గోదాము వద్ద శనివారం ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. నారాయణ్ ఖేడ్ శాసనసభ్యులు శ్రీ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆదేశాల మేరకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఐకేపీ సిబ్బంది తెలిపారు. దళారుల దోపిడీ లేకుండా రైతులకు మద్దతు ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు తమ ధాన్యాన్ని తేమ లేకుండా శు




భ్రంగా ఆరబెట్టి కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.దేవదాస్, బి.పోచయ్య, వెంకట్ రెడ్డి, సర్పంచ్ గంగారాం, ఉప సర్పంచ్ మహేష్, సర్దార్, కిష్టారెడ్డి, బాలయ్య, కిష్టయ్య, మైపాల్ రెడ్డి, ఐకేపీ తరపున ఏపీఎం వంశీ కృష్ణ, సీసీ బేబి, సీసీ రాములు, వీఓలు రేణుక, బుజ్జమ్మ, సాయవ్వ, వీఓఏ కె.బాలమణి తదితర మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పొలంలో విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి...

- **అడవి పందుల కోసం పొలం చుట్టూ విద్యుత్ తీగలు**
- **పొలం కౌలుదారు రాములుపై కేసు నమోదు**
- **అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు**



**నిజాంపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** అడవి పందుల నుంచి పంటను కాపాడేందుకు పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నిజాంపేట మండలం నాగ్ధర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఈ ఘటనలో పొలం కౌలుదారు చీలపల్లి రాములును కల్హేర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.
**వివరాల్లోకి వెళితే..** రామ్‌చందర్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని పోసెట్టిపల్లికి చెందిన చీలపల్లి రాములు, నాగ్ధర్ శివారులో పాశం బాల్‌రెడ్డికి చెందిన భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. పంటను అడవి పందుల నుంచి రక్షించేందుకు పొలం చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడు.
ఈ నెల 16న రాత్రి 7.30 గంటల సమయంలో నాగ్ధర్ గ్రామానికి చెందిన కొక్కొండ సామెల్ (లక్ష్మయ్య కుమారుడు) పొలం వద్దకు వెళ్లగా విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మనుషుల ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడని మృతుడి భార్య సామవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రాములును అరెస్టు చేశారు.

**రైతులకు పోలీసుల హెచ్చరిక....**
పంట పొలాల చుట్టూ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయవద్దని కల్హేర్ పోలీసులు హెచ్చరించారు. వాటివల్ల మనుషులు, పశువులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. అడవి పందుల నివారణకు సౌర విద్యుత్ కంచెలు, డప్పుల శబ్దాలు వంటి సురక్షిత ప్రత్యామ్నాయ పద్ధతులను వినియోగించాలని సూచించారు.

## కేతకి సంగమేశ్వర ఆలయ కమిటీ
## డైరెక్టర్‌గా వీర్శెట్టి ప్రమాణ స్వీకారం



**నాగల్గిద్ద, అక్టోబర్ 24 (జనంసాక్షి):** శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్‌గా నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన అంతారం వీర్శెట్టి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ హాజరయ్యారు. వీర్శెట్టి బాధ్యతలు స్వీకరించడంపై స్థానికులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కమిటీ సభ్యుల సహకారంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని వీర్శెట్టి తెలిపారు.

## వింజపల్లిలో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**కోహెడ, అక్టోబర్ 24(జనంసాక్షి):** మండలంలోని వింజపల్లి గ్రామంలో శనివారం సర్పంచ్ అన్నాడి శ్రీజ-జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణలక్ష్మి పథకం చెక్కులు పంపిణీ చేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు మొత్తం రూ.4 లక్షల విలువైన చెక్కులు అందించినట్లు సర్పంచ్ తెలిపారు. పేద కుటుంబాలకు ఆడపిల్లల వివాహ ఖర్చుల కోసం ఆర్థిక భరోసా కల్పించడంలో ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రంగనవేని వెంకటస్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దూలం శ్రీనివాస్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్‌లో నమోదు
## పొందిన లక్ష్మీప్రసన్నకు అభినందనలు



**మల్దకల్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మల్దకల్‌కు చెందిన ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు నరహరి పద్మ, వెంకటేశ్వర్లు దంపతుల కుమార్తె లక్ష్మీప్రసన్న ఆల్ ఇండియా బార్ కౌన్సిల్‌లో నమోదు పొందారు. దీంతో న్యాయవాదిగా వృత్తిపరమైన బాధ్యతలు నిర్వహించేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా మల్దకల్ మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మనసాని నాగరాజు, బాదామి శ్రీనివాసులు, ఇల్లూరి నాగరాజు, గంగాధర్, జీ. రామకృష్ణ, ఎస్. నరసింహయ్య, నరేందర్, నరహరి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి పర్యాటక రంగానికి మహర్దశ

- **రూ.14 కోట్లతో అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్**
- **తొలి విడతలో రూ.10 కోట్లకు పరిపాలనా అనుమతులు**

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** వనపర్తి నియోజకవర్గంలో పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది ప్రాంతాల్లో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.14 కోట్ల నిధులు కేటాయించగా, తొలి విడతలో రూ.10 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేసిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో ఈ అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. ఈ మేరకు యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ 2026 అక్టోబర్ 19న జీఓ ఆర్టీ నంబర్ 313ను జారీ చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు రిజర్వాయర్లు, చెరువుల వద్ద బోటింగ్ సదుపాయాల కల్పన, సుందరీకరణ పనులు చేపట్టనున్నారు.

**తొమ్మిది ప్రాంతాల్లో అభివృద్ధి పనులు...**

ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో వనపర్తి పట్టణంలోని తిరుమలయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. గోపాల్‌పేట మండలంలోని బుద్ధారం ఆలయంలో సదుపాయాల మెరుగుదల, ఖిల్లా ఘణపురం మండలంలోని ఘణప సముద్రం వద్ద సుందరీకరణతో పాటు బోటింగ్ సదుపాయాల ఏర్పాటు చేపట్టనున్నారు.

అలాగే మామిడిమాడ నేరేడు చెరువు, వనపర్తి ఎంటీబీ ప్రాంతం, వెల్టూరు వేణు గోపాల సముద్రం, చిన్నగుంటపల్లి గుండ్ల చెరువు, శ్రీరంగాపురంలోని రంగసముద్రం ప్రాంతాల్లో పర్యా టక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.

వనపర్తి పట్టణంలోని గ్రంథాలయ హాలును కల్చరల్ సెంటర్‌గా తీర్చిదిద్దేందుకు కూడా చర్యలు చేపట్టనున్నారు.

**పర్యాటక అభివృద్ధికి కీలక ముందడుగు...**

నియోజకవర్గంలోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా



వనపర్తి ప్రాంతానికి పర్యాటకుల రాక పెరుగుతుందని భావిస్తున్నారు.

పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగ డంతో పాటు ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించే అవకాశం ఉంది. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించి, పర్యాటక ప్రాజెక్టులకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో పర్యాటక ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, వనపర్తిని పర్యాటక రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## మానవత్వం చాటుకున్న బీఆర్ఎస్ నాయకుడు గుబ్బపు మచ్చేందర్



**కల్హేర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** కల్హేర్ మండలం ఖానాపూర్ (బి) గ్రామానికి చెందిన మాదిగ పోచయ్య పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గుబ్బపు మచ్చేందర్ శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలవడమే జీఎంఆర్ ఫౌండేషన్ లక్ష్యమని, ప్రజలకు కష్టాలు ఎదురైనప్పుడు సహాయం చేసేందుకు ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజయ్య సాగర్, అమరే నాయక్, కిష్టారెడ్డి, దేవయ్య, బసవరాజు పటేల్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీట్‌లో సత్తాచాటిన గ్రామీణ విద్యార్థిని



**మునిపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని మన్నే లహరిక నీట్‌లో ర్యాంకు సాధించి, వికారాబాద్ మహావీర్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్దచెల్మెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమెను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. పేదలకు సేవలందించే మంచి వైద్యురాలిగా ఎదగాలని మండల విద్యాధికారి భీమ్‌సింగ్, సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దాపురం దుర్గయ్య ఆకాంక్షించారు.

## వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



**ఊర్కొండ, అక్టోబర్ 24 (జనంసాక్షి):** గుర్తుకు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఉర్కొండ ఎస్సై రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారిపై రేవల్లి గేటు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సంఘటన స్థలంలోనే మృతి చెందగా మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఫోటోలోని వ్యక్తిని ఎవరైనా గుర్తుపడితే ఊర్కొండ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712657754 కు సమాచారం అందించగలరని పోలీసులు కోరారు.

## శేరుపల్లి విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు



**శ్రీరంగాపూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మండలం శేరుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభలో ముందున్నారని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ ప్రశంసించారు. రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన సురేఖ, సైనిక్ స్కూల్‌లో సీటు పొందిన భార్గవ్, సీఈఓ కాలేజీలో ప్రవేశం పొందిన రూప, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వర్షతో పాటు మరో విద్యార్థిని సన్మానించారు. ఉపాధ్యాయులు నరసింహ, రమేష్, ఈశ్వర్‌రెడ్డి, ప్రసన్నలను కూడా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నేడు భగలాముఖి శక్తిపీఠంలో మహాయాగ క్రతువు

- **హాజరు కానున్న ప్రముఖులు, వేద పండితులు**
- **108 యాగ కుండాళలతో ఏర్పాట్లు**



**శివ్వంపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** దక్షిణ భారత దేశంలో ప్రముఖ క్షేత్రంగా అనతి కాలంలోనే ప్రత్యేక గుర్తింపు పొంది, దేశ విదేశాల నుంచి ఇక్కడికి భక్తులు పెద్దసంఖ్యలో రప్పించుకొని, అనునిత్యం అమ్మవారిని దర్శించుకునే విధంగా భగలాముఖి శక్తి ఫిఠం ప్రాచుర్యం పొందినది అనీ చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. అటువంటి మహిమాన్వితమైన కోవెలలో ఈ నెల 25 అష్టోత్తర శత (108) కుండాత్మక శ్రీ బగళాముఖీ మహా మంత్రానుష్ఠాన మహాయాగం నిర్వహించేందుకు శ్రీ భగలముఖి చారిటబుల్ ట్రస్ట్ నిర్ణయించి, అందుకు తగినట్లుగా బహువిధములైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకకాలంలో సుమారు 50 మంది వేద పండితుల మంత్రోచ్ఛరల మధ్య 108 జంటలు శ్రీబగళాముఖీ యాగంలో పాల్గొని వారిచేత ఈ మహా యజ్ఞం నిర్వహించేందుకు శక్తి పీఠ వ్యవస్థాపకులు, శ్రీ విద్యా ఉపాసకులు శాస్త్రుల లక్ష్మీవేంకటేశ్వరశర్మ సారథ్యంలో గదా రెండు రోజుల ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఉపాసకులు వెంకటేశ్వర శర్మ మాట్లాడుతూ లోకకల్యాణార్థము ఆదివారం ఉదయం 8 గంటలకు అష్టోత్తరశత (108) కుండాత్మక శ్రీ బగళాముఖీ మహా మంత్రానుష్ఠాన మహాయజ్ఞము ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. యాగానికి సంబంధించిన విశిష్టత ఆయన తెలియజేశారు. శారీరక, మానసిక, కుటుంబ, ఋణబాధా, శత్రుబాధా, న్యాయ సంబంధ, వ్యాపార, ఉద్యోగ, రాజకీయాది అనేక బాధలనుండి నివృత్తికై స్వయంగా శ్రీబగలాముఖీ మహా నామ మంత్ర మహాయజ్ఞంలో పాల్గొని భక్తులు మన వారి జీవితల్లో కొత్త వెలుగులు నింపుకోవడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని, తప్పనిసరిగా సూచించిన సమయానికి ముందే సాంప్రదాయ వస్త్రాలతో భక్తులు దేవాలయానికి చేరుకోని మీకు కేటాయించిన స్థలములో కూర్చోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే యజ్ఞములో పాల్గొనే భక్తులకు పూజా సామాగ్రి దేవస్థానం నుండి ఇవ్వబడుతుందని, వారికీ అల్పాహారం అన్నప్రసాదం ఉంటుందని చెప్పారు. ఈ యాగంలో క్రింద కూర్చోవడం ఇబ్బంది ఉన్నవారు వచ్చేటప్పుడు చిన్న స్టూల్స్ తెచ్చుకోవాలని సూచించారు. ఈ మహాయజ్ఞం ముగిసిన తర్వాత అమ్మవారి పసుపు, యజ్ఞ విభూతి భక్తులకు ప్రసాదముగా ఇవ్వబడుతుందని చెప్పారు. అయితే సంవత్సరంలో ఒకసారి మాత్రమే ఈ మహా యజ్ఞం జరుగుతుందని, ఈ యజ్ఞములో తప్పక పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని తెలియజేశారు. నిర్ణయిత సమయానికి ముందుగా వచ్చే దంపతులు వారి పేర్లు నమోదు చేసుకునే వారికే అవకాశం ఉంటుందని శర్మ వెల్లడించారు.

## వాల్మీకుల ఐక్య గర్జన



**గద్వాల, అక్టోబర్ 25 (జనంసాక్షి):** పట్టణంలో శనివారం వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంలో వాల్మీకులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విద్య, ఉద్యోగ రంగాల్లో వాల్మీకులకు సముచిత స్థానం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా తమకు దక్కాల్సిన సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

హక్కుల సాధన కోసం వారు చేసిన నినాదాలతో పట్టణ వీధులన్నీ మారుమోగాయి. వాల్మీకుల జన సందోహంతో గద్వాల పట్టణం ఒక్కసారిగా జనసంద్రంగా మారింది. భవిష్యత్తులో తమ డిమాండ్ల సాధన కోసం మరిన్ని ఉద్య మాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ ప్రదర్శన వాల్మీకి సామాజిక వర్గంలో ఒక నూతన ఉత్తేజాన్ని నింపింది. శాంతియుతంగా సాగిన ఈ ర్యాలీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## నీటి అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



**అమీన్పూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** అమీన్పూర్ డివిజన్ పరిధిలో అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భాజపా డివిజన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్ డిమాండ్ చేశారు. శనివారం తహసిల్దార్ వెంకటేష్‌కు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్పూర్ డివిజన్ పరిధిలో అక్రమంగా బోర్లు వేసి నీటి వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. దాంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని గుర్తు చేశారు. దీనిపై ఉన్నతాధికారులు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతోపాటు భాజపా జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు కొండ లక్ష్మణ్, నాయకులు మహేష్ శ్రీకాంత్, ధర్మపురి రవి కొత్తపల్లి శీను, వాణి నగర్ దర్శన్ నగర్ హెచ్ఎంటి స్వర్ణపురి కాలనీల వాసులు ఉన్నారు.

## వీరన్నపేటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**చేర్యాల, అక్టోబర్ 24(జనంసాక్షి):** వీరన్నపేట గ్రామానికి చెందిన ఆరెల్ల బాలనర్సవ్వకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శైలజా శివశంకర్, ఉప సర్పంచ్ కిరణ్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు అరిగే కనకయ్య, వార్డు సభ్యులు ఏలుసాని యాదగిరి, రోమాల సురేష్, ఆలేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# మద్దికుంటలో ఘనంగా దేవి నవరాత్రుల నిమజ్జనోత్సవం





- **ఐకమత్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం: పులిమామిడి రాజు**

**సంగారెడ్డి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** సదాశివపేట మండలం మద్దికుంట గ్రామంలో దేవి నవరాత్రుల ముగింపు సందర్భంగా దుర్గామాత నిమజ్జనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పీఎంఆర్ ఫౌండేషన్ అధినేత పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన మన్నె పద్మ-కృష్ణ దంపతులకు రాజు సైకిల్‌ను బహూకరించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించి భక్తులకు ఏర్పాట్లు చేసిన గ్రామస్తులను అభినందించారు.

**ఐకమత్యమే అభివృద్ధికి పునాది...**

పులిమామిడి రాజు మాట్లాడుతూ గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో పండుగలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో సోదరభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను కలిసికట్టుగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవి సింగ్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ మమత, మాజీ ఉపసర్పంచ్ సుభాన్, గ్రామ పెద్దలు, భవానీమాత సంఘం సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బోగారంలో అభివృద్ధి పనులకు భూమిపూజ

- **అంగన్‌వాడీ కేంద్రానికి రూ.25 లక్షలు.. మహిళా సంఘం భవనానికి రూ.10 లక్షలు**



**గుండుమల్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** గుండుమల్ మండలంలోని బోగారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, మహిళా సంఘం భవన నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వేణుగోపాల్, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ రవికాంత్ ముఖ్య అతిథులుగా హాజరై భూమి పూజ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి రూ.25 లక్షలు, మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు కాడ నిధుల ద్వారా మంజూరైనట్లు గ్రామ సర్పంచ్ శేఖర్ గౌడ్ తెలిపారు. ఈ భవనాల నిర్మాణంతో గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలకు, చిన్నారుల సంరక్షణకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం కమ్యూనిటీ కోఆర్డినేటర్ నర్సింహులు, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు అనురాధ, గ్రామ పంచాయతీ కార్యదర్శి అచ్యుత్, ఉపసర్పంచ్ సాయప్ప, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, రాములు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా మున్నూరు రవీందర్‌కు అవకాశం కల్పించాలి

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు వనపర్తి న్యాయవాదుల వినతి**
- **52 మంది న్యాయవాదుల మద్దతు.. సానుకూలంగా స్పందించిన రాష్ట్ర అధ్యక్షుడు**



**వనపర్తి అక్టోబర్ 24 (జనంసాక్షి):** బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ నాయకుడు మున్నూరు రవీందర్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ వనపర్తి బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మున్నూరు రవీందర్ పార్టీకి అందిస్తున్న సేవలు, సీనియర్ నాయకుడిగా ఆయనకున్న అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని న్యాయవాదులు కోరారు. ఈ ప్రతిపాదనకు మద్దతుగా వనపర్తికి చెందిన మొత్తం 52 మంది న్యాయవాదులు తమ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. న్యాయవాదుల వినతిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. తమ అభ్యర్థనను రాష్ట్ర నాయకత్వం పరిశీలిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మోహన్ గౌడ్, రామచంద్రారెడ్డి, మోహన్ కుమార్, వెంకటాచారి, కె. వెంకటరమణ, డి.అశోక్ రావు, రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి, బి.విజయ్ భాస్కర్ గౌడ్, నలువోతుల అరవింద్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నుంచి నిధులు వచ్చినా కూడా ఉద్యోగులకు జీతాలు రాలేదు



**మహబూబ్నగర్, అక్టోబర్ 24,(జనంసాక్షి):** మహబూబ్నగర్ జిల్లాలో అన్ని మండలాలలోని వివిధ గ్రామాలలో ప్రీప్రైమరీ పాఠశాలలో టీచర్ గా మరియు ఆయాగా జులై నెల నుంచి వీధులు నిర్వహిస్తున్న, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన కూడా టీచర్లు, ఆయాలకు జీతాలు రాలేదని తెలియజేస్తున్నారు. వెంటనే జీతాలు వారి వ్యక్తిగత పారితోషికాన్ని గుర్తించి అకౌంట్లో జమ అయ్యే విధంగా జిల్లావిద్యాశాఖ అధికారి విజయకుమారి మేడం, చొరవ తీసుకోవాలని గండీడ్ మండలం పగిడాల్ ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్ పగిడాల్ బోరుకవిత కోరుతున్నారు.

# రైతులు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- **పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి**
- **ముకర్లాబాద్‌లో రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ..**



**మహమ్మదాబాద్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి,నీటిని పొదుపు చేస్తూ అధిక దిగుబడులు సాధించాలని పరిగి ఎమ్మెల్యే, టి.రామ్మోహన్ రెడ్డి సూచించారు. మహమ్మదాబాద్ మండలం ముకర్లాబాద్ రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు స్ప్రింక్లర్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ప్రింక్లర్ల ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని,పంటలకు అవసరమైన నీటిని అందించవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆధునిక వ్యవసాయ పరికరాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు. మండల అధ్యక్షుడు కేఎం నారాయణ,పిఎస్ఎస్ చైర్మన్ కమతం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిరంగా మొక్కర్లబాద్ సర్పంచి అక్కం లక్ష్మి,డైరెక్టర్ బాల ముకుందం, కాంగ్రెస్ పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్షన్ వెరిఫికేషన్, పాఠశాలల తనిఖీ

- **ఎల్‌నినో పరిస్థితులపై గ్రామస్తులకు అవగాహన**



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 24(జనంసాక్షి);** ధరూర్ మండలంలోని వామనపల్లి, ఉప్పేరు, ఖమ్మంపాడు, గార్లపాడు గ్రామాల్లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు నర్సింగ్ రావు పెన్షన్ లబ్ధిదారుల వెరిఫికేషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందుతున్న తీరును పరిశీలించారు.

అనంతరం ఉప్పేరు పిహెచ్‌సి ని తనిఖీ చేశారు. అలాగే ఉప్పేరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను, గార్లపాడు పాఠశాలలను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరు, విద్యా బోధన, పాఠశాల పరిసరాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.

గ్రామస్తులకు ఎల్‌నినో పరిస్థితుల గురించి వివరించి, వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి వృథాను అరికట్టాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని అవగాహన కల్పించారు.

# ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ బాలానగర్‌లో ప్రజాసంఘాల నిరసన



**బాలానగర్, అక్టోబర్ 24(జనంసాక్షి):** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను వ్యతిరేకిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బాలానగర్ మండల కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లా నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి. జగన్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ పేరుతో కోట్లాది మంది ఓటర్ల హక్కులను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, గిరిజనుల ఓట్లను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యతను విస్మరించిందని అన్నారు. జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, యాదయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జంగయ్య, ఏరియా నాయక్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం నాయకులు లక్ష్మమ్మ, నీలమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- **ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు చురుగ్గా పాల్గొనాలి: బీజేపీ నాయకులు**



**శ్రీరంగాపూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు విమర్శించారు. శనివారం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ఎన్నికల కన్వీనర్ పురుషోత్తం రెడ్డి మాట్లాడారు.

అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకుని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి మండలానికి ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను అందుబాటులో ఉంచామని, పట్టభద్రులు వారి వద్దకు వెళ్లి ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పంటలు ఎండిపోతున్నా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. రైతులకు పంటల బీమా పథకాన్ని అమలు చేయడంతో పాటు, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధిపై దృష్టి సారించకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. జూరాల నీటి నిర్వహణ, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల చెల్లింపుల విషయంలో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోందని విమర్శించారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి పట్టభద్రుడు భాగస్వామి కావాలని బీజేపీ నాయకులు కోరారు.

# గ్రామాల అభివృద్ధే నా లక్ష్యం: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి







- మోదంపల్లిలో రూ.1.33 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**బాలానగర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** బాలానగర్ మండలంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మండలంలోని 17 గ్రామాల్లో పర్యటించి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మోదంపల్లి గ్రామంలో సర్పంచ్ శివ ఆధ్వర్యంలో రూ.1.33 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసి, గ్రామస్తులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. **ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...** గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మోదంపల్లి ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హెచ్ఎండీఏ నిధులతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు.

**నీటి సమస్యపై ముందస్తు చర్యలు తీసుకోవాలి...**



రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున గ్రామాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో తాగునీటి వనరులు, వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్లను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అన్నారు. సమస్య ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రజా ప్రతినిధులందరి బాధ్యతని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించాలని, బాలానగర్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బల్కంచెల్క తండాలో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ



**నిజాంపేట్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలం బల్కంచెల్క తండాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ సూపర్‌వైజర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ, పిచికారీ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పిచికారీ చేసే సిబ్బంది తప్పనిసరిగా రక్షణ కిట్లు ధరించి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# గుండె శస్త్రచికిత్స చేయించుకున్న గాల్ రెడ్డి

- ఈశ్వరప్ప గారిని పరామర్శించిన GMR ఫౌండేషన్ చైర్మన్



**సిర్గాపూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలం చిమల్పాడ్ గ్రామానికి చెందిన గాల్ రెడ్డి, మహారాజ్ గారికి గుండె శస్త్రచికిత్స జరిగినందున మరియు ఈశ్వరప్ప ,ఆరోగ్య పరిస్థితి బాగా లేదన్న విషయం తెలుసుకున్న GMR ఫౌండేషన్ చైర్మన్, BRS పార్టీ నాయకులు గుఱ్ఱపు మచ్చేందర్, వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెబుతూ, అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ మండలం BRS పార్టీ సీనియర్ నాయకులు బసవరాజు పటేల్, మాజీ సర్పంచ్ బస్ రెడ్డి, యువ నాయకులు రమేష్ పటేల్, విఠల్ మహారాజ్, వార్డు మెంబర్ రాములు, గ్యానిరెడ్డి, నాయకులు వీరేందర్, సంతోష్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# చిల్వర్‌లో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం



**అల్లాదుర్గం, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మండలంలోని చిల్వర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి నెలవంక మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి పాటించాలని సూచించారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ, పంట అవశేషాల నిర్వహణపై అవగాహన కల్పించారు. పెట్టుబడి ఖర్చులు తగ్గించి, శాస్త్రీయ సాగు పద్ధతులతో అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు లక్ష్మి, నవీన్, విఠల్, ఆత్మ కమిటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# కర్ణాటక రోడ్డు ప్రమాదంలో మనూర్ దంపతులు మృతి

- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్యే శరణు సలగార







**మనూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** కర్ణాటక రాష్ట్రంలోని బసవకల్యాణ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మనూర్ మాజీ సర్పంచ్ సంజీవులు, ఆయన భార్య సంగీత మృతి చెందారు. కుటుంబ సభ్యులతో కలిసి కారులో మహారాష్ట్రలోని తుల్జాపూర్ అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న బసవకల్యాణ్ ఎమ్మెల్యే శరణు సలగార వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. దంపతుల మృతితో మనూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలు స్వగ్రామానికి చేరుకోగా, డీసీసీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కర్, బీఆర్ఎస్ నేత, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ తదితరులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో రాఘవచారి, సతీష్, నర్సింలు, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన





**టేక్మాల్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, టేక్మాల్‌లో శనివారం విద్యార్థులకు పోక్సో చట్టం, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సుచరిత మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, మంచి స్పర్శ-చెడు స్పర్శ మధ్య తేడా, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం, అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా స్పందించే విధానంపై వివరించారు. అలాగే పోక్సో చట్టం కింద బాలల హక్కులు, రక్షణకు సంబంధించిన నిబంధనలను వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల బారిన పడకుండా మొబైల్, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కేజీబీవీతో పాటు ఇతర విద్యాసంస్థల్లో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రాజేంద్ర ప్రసాద్, టేక్మాల్ తహసిల్దార్ తులసీరాం, ఎస్ఐ అరవింద్ కుమార్, సర్పంచ్ సుధాకర్, సత్యనారాయణ, విరప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇంట్లో చోరీ - బంగారం అపహరణ



**రేవల్లి, అక్టోబర్ 24(జనంసాక్షి):** రేవల్లి గ్రామానికి చెందిన వంకేశ్వరం బేబీ (35) ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధితురాలు వంకేశ్వరం బేబీ భర్త లేట్ రామచంద్రయ్య, దసరా పండుగ సందర్భంగా తేది: 20.10.2026 న తన తల్లిగారి ఊరైన తల్పునూర్ కు వెళ్లింది. తిరిగి శుక్రవారం తేది: 23.10.2026 న రాత్రి తిరిగి ఇంటికి వచ్చి బీరువాలో చూడగా, తన యొక్క రెండు తులాల బంగారు నాను, మూడు మాసాల బంగారు కమ్మలు కనిపించలేదు. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లోకి ప్రవేశించి బంగారు ఆభరణాలను దొంగిలించుకుని పోయారని గుర్తించిన బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు రేవల్లి మండల ఎస్సై రజిత తెలిపారు.

# నిడ్జింతలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు క్రీడా పోటీలు



**కొత్తపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం నిడ్జింత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రత్యేక అవసరాల విద్యార్థుల క్రీడా పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి ఆర్. ఆంజనేయులు, పీడీ స్టాలిన్, ప్రత్యేక ఉపాధ్యాయుడు జలీల్ పాల్గొని విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల, పోటీతత్వం పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, చెస్, క్యారమ్స్, 60 మీటర్ల పరుగు, షాట్‌పుట్ తదితర పోటీలు నిర్వహించారు. లెమన్ స్పూన్ పోటీలో నిడ్జింత ప్రాథమిక పాఠశాల ఐదో తరగతి విద్యార్థి కేశవ్ మొదటి బహుమతి, కిష్టన్‌నగర్ పాఠశాల మూడో తరగతి విద్యార్థి అనిల్ రెండో బహుమతి సాధించారు. నిర్వాహకులు విద్యార్థులను అభినందించారు.

# బీర్ల కళాకారుడు అయ్యల్లం మృతి



**చేర్యాల, అక్టోబర్ 24 (జనంసాక్షి):** పట్టణానికి చెందిన బీర్ల కళాకారుడు నంగి (బీర్ల) అయ్యల్లం (65) ఇటీవల గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అకస్మాత్తుగా శనివారం తెల్లవారుజామున జామున మరో సారి గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఆయన మృతి పట్ల బీర్ల కళాకారులు, ప్రముఖులు పార్థివదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మృతి కళా రంగానికి తీరని లోటని సంతాపం వ్యక్తం చేశారు.

# ఫోటోగ్రాఫర్ కుటుంబానికి రూ.15 వేల సాయం



**మల్లకల్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** నీలిపల్లి గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ సుమంత్ ఈ నెల 19న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. అధ్యక్షుడు శేఖర్ ఆధ్వర్యంలో శనివారం సుమంత్ కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీచుపల్లి, రంగన్న, వేణు, సత్యం, బతుకన్న, నరసింహులు, శివ, అశోక్, ప్రవీణ్, రాజనందం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కాలనీ నూతన కమిటీకి ఘన సన్మానం...!

- కాలనీ అభివృద్ధికి డిప్యూటీ మేయర్ భరోసా
- రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో అక్టోబర్ 24(జనంసాక్షి):** నగరంలోని సర్వే నంబర్ 25లో ఉన్న జర్నలిస్ట్ కాలనీని జిల్లా కేంద్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ, కాలనీవాసుల సౌకర్యార్థం త్వరలోనే రూ.20 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అనంతరం జర్నలిస్ట్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంక్షేమ కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి ఆల సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చిక్క వెంకటరమణ, కోశాధికారి రవిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.

కాలనీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో కాలనీవాసులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి, కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు గోవర్ధన్ గౌడ్, బసవరాజు, రామ్ కొండతో పాటు పలువురు జర్నలిస్టులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫిన్‌లాండ్ విద్యా అధ్యయన పర్యటనకు జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల ఎంపిక





**నారాయణపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిన్‌లాండ్ అంతర్జాతీయ విద్యా అధ్యయన పర్యటనకు నారాయణపేట జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారని డీఈఓ గోవిందరాజు తెలిపారు. మక్తల్ మండలం గొల్లపల్లి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీకాంత్, సభా సుల్తానా ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఫిన్‌లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ తుర్కు, యూనివర్సిటీ ఆఫ్ హెల్సింకి ఆధ్వర్యంలో జరిగే శిక్షణలో విద్యార్థి కేంద్రిత బోధన, నిర్మాణాత్మక మూల్యాంకనం, సామర్థ్యాల ఆధారిత విద్య, సమ్మిళిత తరగతి గది నిర్వహణపై అధ్యయనం చేస్తారని వివరించారు.

వినూత్న బోధనా పద్ధతులతో విద్యార్థుల అభ్యసనాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు వీరు ఎంపికయ్యారని తెలిపారు. పర్యటన అనంతరం జిల్లాలోని ఇతర ఉపాధ్యాయులకు ఉత్తమ బోధనా విధానాలను వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## బాచేపల్లిలో ఆవుల చోరీ.. పోలీసుల విచారణ




**నిజాంపేట్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** నిజాంపేట్ మండలం బాచేపల్లికి చెందిన రైతు గంజాయి సత్యనారాయణకు చెందిన మూడు ఆవులను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వ్యవసాయ క్షేత్రం సమీపంలోని అయ్యప్ప మందిరం వద్ద ఉన్న ఆవులను దొంగలు తీసుకెళ్లినట్లు బాధితుడు కల్వేర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవిగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు వివరాలను పరిశీలిస్తూ విచారణ చేపట్టారు. ఆవుల ఆచూకీ కనుగొనేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

## సదాశివపేటలో ఉచిత ప్రకృతి వైద్య శిబిరం ప్రారంభం



**సదాశివపేట అక్టోబర్ 24(జనంసాక్షి):** పట్టణంలోని శ్రీ రామ కళామందిరం ఆధ్వర్యంలో డాక్టర్ రామ్ మనోహర్ లోహియా – ఆరోగ్య జీవన్ సంస్థాన్ సహకారంతో ఉచిత ప్రకృతి వైద్య శిబిరం శనివారం ప్రారంభమైంది. ఈ నెల 29వ తేదీ వరకు శిబిరం కొనసాగనుంది.

ప్రముఖ థెరపిస్ట్ డి.కె. వైష్ణవ్ ఆధ్వర్యంలో అక్యుప్రెషర్, సుజోక్, కప్పింగ్, వైబ్రేషన్ థెరపీల ద్వారా చికిత్స అందిస్తున్నారు. మోకాళ్లు, నడుము, కీళ్ల నొప్పులతో పాటు వివిధ దీర్ఘకాలిక సమస్యలకు వైద్యం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు శిబిరం నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 కాగా, ఐదు రోజుల పాటు వైద్యం ఉచితంగా అందిసారు. మోకాళ్లు, నడుము నొప్పులతో బాధపడేవారు పాత ఎక్స్‌రేలు ఉంటే తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9490784400, 9440494655 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రమేష్, పిల్లోడి విశ్వనాథం, శరత్ చంద్ర, గోవర్ధన్ రెడ్డి, కళ్యాణం బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేతివానిపల్లి తాండలో అసంపూర్తి పనులతో ప్రజలకు ఇబ్బందులు



**మల్దకల్, అక్టోబర్ 24(జనంసాక్షి):** మండల పరిధిలోని నేతివానిపల్లి తాండలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గుడి ఆర్&బి రోడ్డు పక్కన నెల రోజుల క్రితం పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలను అలాగే వదిలేశారు. వచ్చిపోయే వారికి ప్రమాదకరంగా మారాయి. తాండాకు వచ్చే తాగునీటి పైపులు పగిలి నీరు రోడ్డుపై వృథాగా పారుతోంది. అదే గుంతలో మురుగు నీరు కలిసి తాగునీటిలోకి చేరుతోందని, దీనివల్ల విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. క్రీడా ప్రాంగణం సూచిక బోర్డు కనబడటం లేదు. దాని చుట్టూ ముళ్ళ చెట్లు, చెత్తతో దుర్వాసన వస్తోంది. వెంటనే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి స్పందించి గుంతలను పూడ్చి, పైప్ లైన్ మరమ్మతులు చేయించి, బోర్డు ఏర్పాటు చేసి, పరిసరాలను శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సిసి రోడ్డు పరిశీలించిన మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రాధా అరుణ్ కుమార్



**అమరచింత, అక్టోబర్ 24 (జనంసాక్షి):** శనివారం తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారంగా, టీజీ టాడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు,అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని 5వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఎస్. రాధా అరుణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా చూడాలని సూచించారు

వార్డులోని ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడటం, కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం లక్ష్యంగా సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో నాణ్యతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని సూచించారు.

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అమరచింత మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రవికుమార్, హరీష్, ప్రశాంత్, శ్రీకాంత్, కార్తీక్, భీమరాజు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దారికి అడ్డంగా మొద్దు.. ప్రశ్నించిన వృద్ధుడిపై దాడి

- బుద్ధారంలో ఘటన... పోలీసులకు ఫిర్యాదు

**గోపాల్‌పేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** దారికి అడ్డంగా మొద్దు పెట్టడాన్ని ప్రశ్నించిన ఓ వృద్ధుడిపై దాడి జరిగిన ఘటన గోపాల్‌పేట మండలం బుద్ధారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నర్సింహ (75)పై అదే గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్ (35) దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నెల 22న నర్సింహ ఇంటికి వెళ్తుండగా మార్గంలో మొద్దు అడ్డంగా ఉండటాన్ని గమనించి, దాని గురించి రమేష్‌గౌడ్‌ను ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగగా, రమేష్‌గౌడ్ దుర్భాషలాడుతూ నర్సింహ ముఖంపై చేతులతో కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో వృద్ధుడి నోటికి గాయమై రక్తస్రావమైంది.

విషయం తెలుసుకున్న నర్సింహ కోడలు యెర్రుల రాములమ్మ ఆయనను చికిత్స నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఘటనపై గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## శమీ పూజపై ఏదుల సర్పంచ్ ఫిర్యాదు



**రేవల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ఏదులలో విజయదశమి సందర్భంగా నిర్వహించిన శమీ పూజలో తనను ఉద్దేశపూర్వకంగా దూరం పెట్టి అవమానించారని గ్రామ సర్పంచ్ కె.పరశురాముడు గోపాల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు దక్కాల్సిన సంప్రదాయ పాత్రను విస్మరించి, వి.ప్రవీణ్‌రెడ్డి, ఎ. మహేష్‌రెడ్డి వారి అనుచరులు ముందుగానే పూజ నిర్వహించి శమీ ఆకులను పంపిణీ చేశారని ఆరోపించారు. దీనివల్ల గ్రామంలో కుల విభేదాలు ఏర్పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ పెద్దలతో పరిష్కారానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై శశిధర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఎస్ఐ అశోక్ బాబుకు ఘనంగా వీడుకోలు పలికిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ ఐపీఎస్



**మాగనూర్, (జనంసాక్షి):** బదిలీపై వెళ్తున్న ఎస్ఐ అశోక్ బాబుకు ఘనంగా వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ డాక్టర్ జి.వినీత్ ఐపీఎస్ నారాయణపేట జిల్లా మాగనూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా రెండు సంవత్సరాల రెండు నెలల పాటు విధులు నిర్వర్తించి, బదిలీపై గద్వాల జిల్లాకు వెళ్తున్న ఎస్ఐ అశోక్ బాబును జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్, డీఎస్పీ నల్లపు లింగయ్య, మహేష్, సీఐ రామ్ లాల్‌తో పాటు పోలీస్ అధికారులు, సిబ్బంది శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ. ఉద్యోగ జీవితంలో బదిలీలు సర్వసాధారణమని, పోలీస్ అధికారులు ఎక్కడ విధులు నిర్వర్తించినా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, ప్రజల పట్ల సానుకూల దృక్పథం కలిగి ఉండాలని అన్నారు.

ఈ సందర్భంగా ఎస్ఐ అశోక్ బాబు మాగనూరు మండలంలో అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన తదుపరి విధుల్లో మరింతగా రాణించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. బదిలీపై గద్వాల జిల్లాకు వెళ్తున్న అశోక్ బాబుకు పోలీస్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలుపుతూ వీడ్కోలు పలికారు.

# సంగారెడ్డిలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు శిక్షణ శిబిరాలు

- ఈ నెల 25 నుంచి మొదటి విడత..
- కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లిలోని తెలంగాణ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు ఈ నెల 25 నుంచి ప్రాథమిక శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి. మాధవరెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయి శిక్షణాధికారుల ఆధ్వర్యంలో రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడత అక్టోబర్ 25 నుంచి 31 వరకు, రెండో విడత నవంబర్ 1 నుంచి 7 వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ఈ శిబిరాల్లో వివిధ జిల్లాలకు చెందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొననున్నారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కోశాధికారి జి. సుందర్ రావు, జిల్లా కార్యదర్శి వి. మాధవరెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎం. శోభ, జిల్లా నిర్వహణ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, వందన తదితరులు పాల్గొన్నారు.

## కాటవరం స్టేజి సమీపంలో రోడ్డు ప్రమాదం.. జింక మృతి



**అడ్డాకుల, అక్టోబర్ 24 (జనం సాక్షి):** మండలం కాటవరం స్టేజి సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొన డంతో జింక మృతి చెందింది. శనివారం ఉదయం రహదారి పక్కన జింక మృతదేహాన్ని గమ నించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందిం చారు.సమాచారం అందుకున్న బీట్ ఆఫీసర్ ప్రత్యూష రెడ్డి, వెటర్నరీ డాక్టర్ అశోక్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ అశోక్ రెడ్డి జింకకు పోస్టుమార్టం నిర్వహించగా, అటవీశాఖ అధికారులు మృతదేహాన్ని ఖననం చేశారు.

## చెరుకు టన్నుకు రూ.1000 బోనస్ ఇవ్వాలి - మంత్రి వాకిటి శ్రీహరికి వినతి



**ఆత్మకూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** చెరుకు టన్నుకు రూ.1000 బోనస్ మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ కృష్ణవేణి చెరుకు రైతు సంఘం ఆధ్వ ర్యంలో శనివారం మంత్రి వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేశా రు.ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాజన్న మాట్లాడుతూ.. ఎల్ నినో ప్రభావం తో వర్షపాతం తగ్గి చెరుకు దిగుబడి తగ్గిందని, అందువల్ల రైతులను ఆదుకోవాలని కోరారు. చెరుకు పంటకు రికవరీ విధానాన్ని ఎత్తివేయాలని, లేబర్ కొరత తీవ్రంగా ఉన్నందున కోత యంత్రాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం చెరుకుకు టన్నుకు రూ.6000 గిట్టుబాటు ధర ఇవ్వాలని, డ్రిప్ పరికరాలను సబ్సిడీ కింద అందించాలని కోరారు. అలాగే పరిశ్రమలకు చెరుకు రవాణా సమయంలో ఆర్టీఓ, పోలీసుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షు లు వాసిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. రవి, సభ్యులు రాజశేఖర్ రెడ్డి, నారాయణ, వీరన్న, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 26న మున్సిపల్ కార్మికుల చలో హైదరాబాద్



**నారాయణపేట, అక్టోబర్ 24(జనంసాక్షి):** మున్సి పల్ కార్మికుల సమ స్యలు పరిష్కరించాలని, కార్మికుల కు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే వెనక్కి తీసుకోవా లని, కనీస వేత నం 42వేల రూపాయలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఈ నెల 26న ఇందిరాపార్క్ దగ్గర జరుగు మహాధర్నాలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటున్నారని యూనియన్ గౌరవ అధ్యక్షులు బండమీదిబలరాం, యూనియన్ కోశాధికారి సాయిలు ఆధ్వర్యం నారాయణపేట మున్సి పల్ కమిషనర్ శంకర్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో సిఐటియు జిల్లా నాయకులు నరహరి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్ తెలిపారు. మున్సిపల్ యూనియన్ నాయకులు నర్సింహ, గోవింద్ తదితరులు ఉన్నారు.

## జనసేన ప్రచార కార్యదర్శి తనీష్‌ను కలిసిన నాయకులు



**మద్దూరు, అక్టోబర్ 24 (జనంసాక్షి):** తెలంగాణ జనసేన పార్టీ ప్రచార కార్యదర్శి, సినీ నటుడు తనీష్ అల్లడిని నారాయణపేట జిల్లా, కొడంగల్ నియోజకవర్గ జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పార్టీ బలోపేతం, సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తనీష్ దిశానిర్దేశం చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, బలరాం, అరుణ్ గౌడ్, డీకే అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన



**శ్రీరంగాపూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** శ్రీరంగాపూర్ మండలంలోని షేర్‌పల్లి, కంబాలాపూర్ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ కేత్ బచావో అభియాన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన సమావేశాలు నిర్వ హించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ, భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువులు వినియో గించాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వినియోగాన్ని తగ్గించి, జీవ ఎరువులు, సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని తెలిపారు. పంటల మార్పిడి, పంట అవశేషాలను నేలలో కలపడం ద్వారా భూసారాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గి పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని వివరించారు. సమావేశాల్లో సర్పంచ్‌లు ఎం. వెంకటయ్య యాదవ్, పి. విజయ్ కుమార్ రెడ్డి, ఏఈఓలు మల్లేష్, శివ, రైతులు పాల్గొన్నారు.

# పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి



నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ ద్వారా ప్రమాదాల వివరాల నమోదు, క్లెయిమ్‌ల స్థితి తెలుసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు చికిత్సలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. అనవసరంగా ఆసుపత్రుల నుంచి బాధితులను డిశ్చార్జ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి, పథకం అమలును క్రమం తప్పకుండా సమీక్షించాలని కలెక్టర్లకు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్టీఓ రాధిక, డిపో మేనేజర్ శ్రవణ్, ఆర్అండ్‌బీ అధికారి ప్రగతి, డీఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు, అండగా ఉంటాం!

- మైబుస్‌కు కుటుంబానికి అఖిలపక్షం నాయకులు పరామర్శ
- డాక్టర్ సతీష్ యాదవ్



**వనపర్తి బ్యూరో, అక్టోబరు 24 (జనంసాక్షి):** ఇటీవల అస్వస్థతకు గురై కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మండ్ల మైబుస్‌ను అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు శనివారం పరామర్శించారు. గోపాల్‌పేట మండలం బుద్ధారం గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుడు డాక్టర్ సతీష్ యాదవ్ మాట్లాడుతూ.. మైబుస్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జిల్లెల్ల వరప్రసాద్‌తో అపాయింట్‌మెంట్ తీసుకుని త్వరలో వైద్య పరీక్షలు చేయిస్తామని చెప్పారు. మైబుస్ సంపూర్ణ ఆరోగ్యంతో మునుపటిలా ఉండేలా అవసరమైన వైద్య సహాయం అందించడంలో అఖిలపక్ష ఐక్యవేదిక ముందుంటుందని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, కొత్తగుళ్ల శంకర్, రాజ్‌కుమార్, రాజనగరం రవి, రామస్వామి, శివకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల సమ్మెకు రిటైర్డు ఉద్యోగ సంఘం నాయకుల మద్దతు

- 12వ రోజుకు చేరుకున్న రిలే దీక్షలు



**నారాయణపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీజీ ఎన్.హెచ్.ఎం జేఏసీ ఆధ్వ ర్యంలో చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటితో నారాయణపేట జిల్లాలో 12వ రోజుకు చేరుకు న్నాయి. జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల నిరసన కార్యక్రమానికి జిల్లా, పట్టణ రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మనోహర్ ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వామనగేరి సంతోష్ కుమార్‌లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్.హెచ్.ఎం ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల జీవితాల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగులు నేటికి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య పనిచేయాల్సి వస్తోం దన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు తప్పని సరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన వారిలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి తమ్మలి సత్యనారాయణ,పట్టణ అధ్యక్షులు భరత్, కే.సత్యనారాయణ, కృష్ణయ్యలు ఉన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బిక్షపతి, అధ్యక్షులు ప్రసాద్, కోశాధికారి రాఘవేందర్, ఎన్.హెచ్.ఎం యూనియన్ సభ్యులు డాక్టర్లు వెంకట రమణ, మొహేష్ చారి, నరసింహ రావు సగరి, తిరుపతి, అర్చన, రామస్వామి, మునీర్, హబీబ్, సోహెల్, వినోద్, నరేందర్, విజయ్, కిరీటి, నవశ్రీ, విరోజ, చందన,అనురాధ, సౌందర్య,పుష్ప,సావిత్రమ్మ, దేవిక, సుజాత, శ్వేతశ్రీ, ఉద్యోగులు అజారుద్దీన్, డీడీఎం స్నేహలత, డిపిఏం మమత తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం

**మల్దకల్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని శనివారం మండల బిజెపి అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ సన్నాహకసమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2023 నవంబర్ నాటికి డిగ్రీ పూర్తయిన వారు, లాస్ట్ ఎలక్షన్స్‌లో ఓటేసిన వారు కూడా మళ్లీ ఎన్రోల్మెంట్ చేసుకోవాల్సిందిగా వారు సూచించారు. జరగబోయే ఎంఎల్‌సి ఎన్నికల్లో ప్రతి పట్టభద్రులు ఓటు వినియోగించుకోవాలని వారు సూచించారు.అలాగే హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్నగర్ జరిగే ఎమ్మెల్సీ ఎన్నిక చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బలిగేరా శివారెడ్డి, మండల నాయకులు దామ నాగరాజు, దామ వెంకటేష్, నరసింహులు తదితరులు హాజరయ్యారు.

# పేద యువత కలలకు పోలీస్ శాఖ చేయూత

- **ఉచిత శిక్షణతో ఉద్యోగ సాధనకు బాటలు: ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** పేద, ప్రతిభావంతులైన యువత పోలీస్ ఉద్యోగాలు సాధించేందుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని లైన్స్ క్లబ్‌లో శిక్షణ తరగతులను ప్రారంభించారు.

పోలీస్ ఉద్యోగాల అర్హత పరీక్షకు 413 మంది అభ్యర్థులు హాజరుకాగా, ప్రతిభ ఆధారంగా 130 మంది మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఎంపికైన వారికి ఉచిత వసతి, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన బోధన, స్టడీ మెటీరియల్‌తో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించే దుకు ఫిజికల్ ఫిట్‌నెస్ శిక్షణ అందించ చనున్నట్లు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది యువతకు పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే ప్రతిభ, పట్టుదల ఉన్నప్పటికీ ప్రైవేట్ కోచింగ్ తీసుకునే ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి వారికి సమాన అవకాశాలు కల్పించి, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదవాలని, తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. మాక్ టెస్టుల ద్వారా సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు రాత పరీక్షకు, శారీరక దారుఢ్యానికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోలీస్ శాఖ కల్పిస్తున్న అన్ని సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. శిక్షణలో క్రమశిక్షణ, సమయ పాలన తప్పనిసరని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసు కోవడంతో పాటు శిక్షణ నుంచి తొలగించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. కష్టపడి, పట్టు దలతో నిరంతరం సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చని, అభ్యర్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, సీఐలు, ఎస్ఐలు, పాల్గొన్నారు.

## చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

- **మాసానిపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం**
- **ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461**
- **సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్**
- **ఐకెపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌బాబు**





**జోగిపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి):** రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఐకెపి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం అందోల్ మండలం మాసానిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 మద్దతు ధర చెల్లిస్తోందని తెలిపారు. సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. గ్రామ సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం ద్వారా సేవలు అందించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు అవసరమైన పత్రాలతో కేంద్రాన్ని సంప్రదించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్, సీసీలు సత్యనారాయణ, రాములు, వీవోఏ లాయక్ అలీ, గ్రామ సమాఖ్య అధ్యక్షులు అంజమ్మ, మంజుల, ఉపసర్పంచ్ రొయ్యల రాజు, వార్డు సభ్యులు, మండల సీనియర్ నాయకులు అశోక్ రైతులు పాల్గొన్నారు.

### బూడిదిపాడులో

## భూ రీ సర్వే పనులు ప్రారంభం



**మల్దకల్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మండల పరిధిలోని బుడిదిపాడు గ్రామంలో శనివారము గ్రామ భూ రిసర్వే పనులు ప్రారంభించారు. గ్రామ కంఠము, బౌండరీస్, భూమి సరిహద్దులు సర్వే పనులు చేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రూప్సీరాణి, మండల సర్వేయర్ బీచుపల్లి,ఆర్ఐ మహేందర్ జిపిఓ శ్రీనివాసులు,గ్రామ సర్పంచ్ తూమ్ కృష్ణారెడ్డి, చైనుమెన్ శేఖర్, లైసెన్సు సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓ మంజులాదేవి సేవలు అభినందనీయం

- **పిఆర్టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి**
- **ఎస్.ఎల్.టి.ఏ జిల్లా అధ్యక్షులు సురేందర్ నాథ్**



**జడ్చర్ల, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాల పెంపునకు, ప్రభుత్వ విద్య పటిష్టతకు మండల విద్యాధికారిణి మంజులా దేవి అందించిన సేవలు అభినందనీయమని పిఆర్టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్ రెడ్డి, ఎస్.ఎల్.టి.ఏ జిల్లా అధ్యక్షుడు సురేందర్ నాథ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా శనివారం మండల పరిధిలోని ఉదండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాధికారిణి మంజులా దేవి సందర్శించారు. ఎంఈఓ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పిఆర్టియు టిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ఉపాధ్యాయులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి మండల విద్యాధికారిణి విశేష కృషి చేశారని, మండలాన్ని జిల్లాలోనే విద్యాపరంగా ప్రథమ స్థానంలో నిలిపేందుకు శ్రమించారని, పేద విద్యార్థుల అభ్యున్నతియే ధ్యేయంగా పనిచేశారని కొనియాడారు. ఎస్.ఎల్.టి.ఏ జిల్లా అధ్యక్షుడు సురేందర్ నాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో మండల విద్యాధికారిణి చూపిన చొరవ మరువలేనిదని అన్నారు. మండల విద్యాధికారిణి మాట్లాడుతూ ఉన్నతాధికారుల మార్గదర్శకత్వం, ఉపాధ్యాయుల సహకారం వల్లనే విద్యాభివృద్ధికి కృషి చేయగలిగానని, తన సేవా కాలంలో ఉపాధ్యాయులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తంగిళ్లపల్లి శేఖర్, ఎస్ఎల్టిఏ అధ్యక్షుడు సురేందర్ నాథ్, ఉపాధ్యాయులు రాందాస్, రమాదేవి, ప్రియదర్శిని, హిమబిందు, అర్చన తదితరులు పాల్గొన్నారు.

# నర్మేట్ట జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు

**ముఖ్యఅతిథిగా హాజరైన ఇంచార్జ్ డీఈవో రమేష్, దాత సుచరిత ఇండియా చైర్మన్ కిరణ్**







**నంగునూరు, అక్టోబర్ 24 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలంలోని నర్మెట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన పదో తరగతి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ తగిరెడ్డి దేశీ రెడ్డి అధ్యక్షతన శనివారం రోజు ఎంతో ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి సి. రమేష్, సుచరిత ఇండియా చైర్మన్ డాక్టర్ కిరణ్ హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు నైతిక విలువలను పాటిస్తూ, కంటికి రెప్పలా కాపాడే తల్లిదండ్రులను, దారిచూపే గురువులను ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో సుచరిత ఇండియా గ్రూప్ వారు అందించిన 2 లక్షల 25 వేల రూపాయల నిధులతో నిర్మించిన సిడబ్ల్యూఎస్ఎన్ (వికలాంగుల విద్యార్థుల మరుగుదొడ్డు) టాయిలెట్లను ప్రారంభించడం జరిగింది. అనంతరం గత పదవ తరగతిలో ఉత్తీర్ణులైన 74 మంది విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌సి లో 587 మార్కులతో జిల్లా టాపర్ గా నిలిచిన రేకులపల్లి అమూల్యకు సుచరిత ఇండియా చైర్మన్ నగదు బహుమతి అందించి భవిష్యత్తులో కష్టపడి చదివి ఉన్నత స్థానానికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎంఈఓ దేశీ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, గ్రామ నాయకులుకూతురు రాజిరెడ్డి, నాయిని రవీందర్ రెడ్డి, ఉప్పాల నారాయణ,అజిత్, శ్రీనివాస్, మాజీ ఎస్ఎంసి చైర్మన్ వెంకన్న,, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థుల భోజన నాణ్యతలో రాజీ వద్దు!




- కల్తీ ఆహారంపై కఠిన చర్యలు..
- విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ ఇవ్వాలి

**వనపర్తి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** జిల్లాలోని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని, కల్తీ ఆహారం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ విద్యా సంబంధిత అంశాలపై సమీక్షించారు. సెలవుల అనంతరం విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.



**విద్యార్థినులకు ఆత్మరక్షణ శిక్షణ...**

జిల్లాలోని అన్ని పీఎం శ్రీ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థినులకు కరాటే వంటి ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ అందించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ అవసరమైన కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు.

**నిధులను సద్వినియోగం చేసుకోవాలి...**

పీఎం శ్రీ పాఠశాలలకు మ్యాథ్స్ కిట్లు, సైన్స్ కిట్లు, కెరీర్ గైడెన్స్ కోసం కేటాయించిన నిధులను ప్రధానోపాధ్యాయులు నిర్దేశిత అవసరాలకు వినియో గించాలని తెలిపారు. విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాల పెంపునకు ఈ నిధులు ఉపయోగపడేలా చూడా లన్నారు.

**నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి...**

వివిధ పథకాల కింద పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు మంజూరైన అదనపు గదులు, మరుగు దొడ్ల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు పూర్తయిన వెంటనే నిబంధనల ప్రకారం కాంట్రా క్టర్లకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఏ పాఠశాల లేదా కళాశాలలోనూ మరుగుదొడ్ల కొరత ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి విద్యాసంస్థలో ఉపయోగంలో ఉండే మరుగు దొడ్లు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మరుగు దొడ్లు లేని పాఠశాలలు, కళాశాలల వివరాలతో నివేదిక సమర్పించాలని, నిర్మాణాలకు వెంటనే మం జూరు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని వెల్లడిం చారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నాగేంద్ర కుమార్, టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వా హక ఇంజినీర్ వెంకటరెడ్డి, మండల విద్యాధికారులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

## జనాభా గణన

# ఫేజ్-2 లో సమస్యలను పరిష్కరించాలి

- తహసీల్దార్‌కు పీఆర్‌టీయు వినతి




**కృష్ణ, అక్టోబర్ 24 (జనంసాక్షి):** కృష్ణ మండలంలో జనాభా గణన-2027 ఫేజ్-2 ప్రక్రియలో సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం పిఆర్‌టియు కృష్ణ మండల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫేజ్-1లో ఎదురైన సమస్యలను వివరించారు. హౌస్ లిస్టింగ్ బ్లాకుల వర్గీకరణ సక్రమంగా చేపట్టాలని, ఎన్యుమరేటర్ల కేటాయింపును అవసరాలకు అనుగుణంగా చేయాలని, సూప ర్వైజర్ సర్కిళ్లలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్క రించాలని, క్షేత్రస్థాయిలో జనాభా గణన సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ, ఫేజ్-1 ఇండ్ల గణన విజ యవంతం కావడంలో సంఘం కృష్ణ మండల శాఖ అందించిన సహకారా న్ని అభినందించారు. ఫేజ్-2 జనాభా గణన ప్రక్రియలోనూ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్ర మంలో కృష్ణ మండల అధ్యక్షులు దండు శేఖర్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, గౌరవ అధ్యక్షులు ఎన్. శివరాజ్, టెక్నికల్ అసి స్టెంట్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువజన సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

జానపద నృత్యం, జానపద గీతాల విభాగాల్లో గరిష్ఠంగా 10 మంది చొప్పున పాల్గొనవచ్చు. ప్రదర్శన సమయం 5 నుంచి 8 నిమిషాలు. సహాయక సిబ్బంది వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలి. చిత్రలేఖనం కోసం గరిష్ఠంగా ఆరు గంటల సమయం కేటాయిస్తారు. అవసరమైన చిత్రలేఖన సామగ్రిని అభ్యర్థులే తీసుకురావాలి. వీధి నాటకంలో 10 మంది పాల్గొనవచ్చు. కవితా రచనను అధికారిక రాష్ట్ర భాష, హిందీ లేదా ఆంగ్లంలో రాయవచ్చు. దీనికి అవసరమైన సామగ్రిని కూడా అభ్యర్థులే తెచ్చుకోవాలి.

పాటలు, నాటకాలు, చిత్రలేఖనాల్లో అభ్యంతరకరమైన లేదా మతపరమైన భావాలను కించపరిచే అంశాలు ఉండకూడదని, సంప్రదాయబద్ధమైన, మర్యాదపూర్వకమైన వస్త్రధారణ పాటించాలని అధికారి సూచించారు.

**అక్టోబర్ 27లోపు దరఖాస్తులు...**

ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 27లోపు కలెక్టరేట్ సముదాయంలోని రెండో అంతస్తులో ఉన్న జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయంలో పని వేళల్లో దరఖాస్తులు సమర్పించాలి. ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతిని నివాస ధ్రువీకరణగా, పదో తరగతి జ్ఞాపిక లేదా వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని జతచేయాలి. మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు సమర్పించాలి. మరిన్ని వివరాల కోసం 7386191141, 7981798957, 8431639907 నంబర్లను సంప్రదించాలని టి. అఖిలేశ్ రెడ్డి కోరారు. జిల్లా యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రోటోకాల్ ఉల్లంఘనపై గ్రామ పాలకవర్గం ఆగ్రహం

- సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే కొనుగోలు కేంద్రం ప్రారంభం



**కొల్చారం, అక్టోబర్ 24 (జనంసాక్షి):** కొల్చారం మండలం అప్పాజీపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రోటోకాల్ పాటించలేదని గ్రామ పాలకవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండానే కేంద్రాన్ని ప్రారంభించడంపై అభ్యంతరం తెలిపింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధు లకు సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పించాలని గ్రామ పాలకవర్గం పేర్కొంది. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులను కలిసి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# మున్సిపల్ కార్మికులకు రూ.30 వేల కనీస వేతనం ఇవ్వాలి



**నర్సాపూర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మున్సిపల్ కార్మికులకు రెండో పీఆర్సీ ప్రకటించి కనీస వేతనం రూ.30 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కదారి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ మేనేజర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ఆరోగ్య, భద్రతా సౌకర్యాలు కల్పించాలని, విధి నిర్వహణలో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించే చలో కార్యక్రమంలో పాల్గొంటామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే విధుల నుండి తొలగించాలి

- సర్ ప్రక్రియను నిలిపివేయాలి
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట్ మావో



**చేర్యాల, అక్టోబర్ 24 (జనంసాక్షి):** కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే విధుల నుండి తొలగించాలని, సర్ ప్రక్రియను నిలిపివేసి అక్రమంగా తొలగించిన ఓటర్లను తిరిగి నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగరి వెంకట్ మావో డిమాండ్ చేశారు.చేర్యాల పాత బస్టాండ్ వద్ద శనివారం ప్రజా సంఘాలు, వృత్తి సంఘాల ఆధ్వర్యంలో జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ బీజేపీ లబ్ది కోసం రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ దేశపౌరుల ఓట్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపించా రు. దీని ద్వారా ప్రతిపక్ష పార్టీలను బలహీనపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు.ఓటు నమోదు పని మాత్రమే చేయాలని, పౌరసత్వాన్ని నిర్ణయించే అధికారం ఎన్నికల సంఘానికి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసినా, పెడచెవిన పెడుతూ ఏకపక్ష నిర్ణయాలతో ముందుకు వెళుతున్నారని విమర్శించారు. ఇది దేశ పౌరసత్వానికి ప్రమాదమని, కేంద్ర స్వయం ప్రతిపత్తి సంస్థల విధ్వంసాన్ని, పౌర హక్కులు, రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని అడ్డుకోవడానికి ప్రజలందరూ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వృత్తి సంఘాల నాయకులు బండకింది అరుణ్, రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, సీఐటీయూ జిల్లా నాయకు రాలు ఇప్పకాయల శోభ, దినకెల కనకలక్ష్మి, కొమ్ము రాజుల ఎల్లవ్వ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గుంద్ర రవీందర్ (చుంచనకోట సర్పంచ్), గొర్రె శ్రీనివాస్, రైతు సంఘం చేర్యాల పట్టణ కార్యదర్శి తుప్పతి రాజు, ముస్త్యాల ప్రభాకర్, అవాజ్ జిల్లా నాయకులు ఎండీ ఏజాజ్, ఎండీ కరీం,ఎన్ పీఆర్ డీ చేర్యాల డివిజన్ అధ్యక్షుడు తుమ్మలపల్లి అనిల్, వ్యవసాయ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి బోయిని మల్లేశం, ఎర్రబోసు అశోక్, బియ్య సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు, విద్యుత్ సమస్యలను ప్రధానంగా పరిష్కరించాలి

- సర్పంచుల సమావేశంలో విద్యుత్ సరఫరాపై అధికారులను నిలదీత



**వీపనగండ్ల, అక్టోబర్ 25 (జనంసాక్షి):** మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోందని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపడానికే పరిమితమవుతున్నారని, నిధులు మంజూరు కాకపోవడం తో పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఎంపీడీవో అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో వివిధ శాఖల అధికారుల సమక్షంలో ఈ సమస్యలను ప్రస్తావించారు.

**నిధులు మంజూరైతేనే పరిష్కారం...**

మండలంలోని తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన పనులకు అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపామని సంబంధిత అధికారులు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని పేర్కొన్నారు. నాగర్లబండ తండా సర్పంచ్ గోపాల్ ఈ విషయంపై ప్రశ్నించగా అధికారులు ఇదే సమాధానం ఇచ్చారు. నిధుల మంజూరులో జాప్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచులు తెలిపారు.

**అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా...**

గ్రామాల్లో విద్యుత్ స్తంభాల సమస్యలతో పాటు వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా కావడం లేదని సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేళాపాళా లేకుండా విద్యుత్ సరఫరా చేయడంతో వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, వరి పంట పొట్ట దశలో నీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

**గోపాల్‌దిన్నె సర్పంచ్ దొడ్డ కవిత మాట్లాడుతూ...** గ్రామ సమీపంలో నూతన సబ్‌స్టేషన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు ఆశించిన స్థాయిలో విద్యుత్ సరఫరా కావడం లేదని తెలిపారు. కల్వరాల సర్పంచ్ బందారి రాముడు కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

సమావేశంలో తహసీల్దార్ ఖాజా మైనుద్దీన్, వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్, ఉద్యానవన అధికారి కృష్ణయ్య, నీటిపారుదల శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు. తాగునీరు, విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించా లని సర్పంచులు కోరారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

**ఓటరు నమోదుపై దృష్టి సారించాలి.. పార్టీ శ్రేణులకు నాయకుల పిలుపు**



**కీసర, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం ఖాయమని నాగారం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదేశాల మేరకు శనివారం నాగారం డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఓటరు నమోదు కార్యక్రమంపై చర్చించారు. ప్రతి ఇంట్లోనూ గ్రాడ్యుయేట్లు ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని నాయకులు సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపోటములు ఓటరు నమోదుపై ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత, జెన్-జీ యువతలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై వ్యతిరేకత ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు తగ్గాయని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మిత్రబంధానికి చిరునామా.. మారుతీ మిత్ర మండలి

## మూడో ఏడాది ఘనంగా అలాయ్ బలాయ్ వేడుకలు



**కీసర, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** మిత్రులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చి, ఆత్మీయతను పంచుతూ స్నేహబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మారుతీ మిత్ర మండలి నిర్వహిస్తున్న అలాయ్ బలాయ్ కార్యక్రమం ప్రత్యేకతను చాటుతోంది. మిత్రుల మధ్య స్నేహం, ఆప్యాయతలను పెంపొందించడమే ధ్యేయంగా, మారుతీ మిత్ర మండలి ఆధ్వర్యంలో నాగారం జీఆర్ఎస్ఎస్ గార్డెన్‌లో మూడో ఏడాది అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా మిత్రులంతా ఒకచోట చేరి సంతోషాలను పంచుకునేలా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న.. మండలి నిర్వాహకులు, స్నేహబంధాల బలోపేతానికి కృషి చేస్తున్నారు. మండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి హనుమంత్, కోశాధికారి మచ్చ బాబు, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ చారి మాట్లాడుతూ.. వచ్చే ఏడాది మరింత మంది మిత్రులను భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు సీతారాం రెడ్డి మాట్లాడుతూ.. అలాయ్ బలాయ్ కార్యక్రమం మిత్రులందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే ప్రత్యేకమైన ఆత్మీయ సమ్మేళనమని అన్నారు. రాజకీయాలు, కులమతాలు, హోదాలకు అతీతంగా మిత్రులంతా కలుసుకొని ఆప్యాయతలను పంచుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని పేర్కొన్నారు. నేటి బిజీ





జీవితంలో ఇలాంటి కార్యక్రమాలు పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతోపాటు స్నేహబంధాలను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. మారుతీ మిత్ర మండలి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు రేబెలే శ్రీనివాస్ గుప్తా, రామిని తిరుమలేష్ గుప్తా, ఈసీఐఎల్ రిటైర్డ్ ఉద్యోగి పాండు, బీఆర్ఎస్ నాయకుడు ఎనుముల నరసింహారెడ్డి, బీజేపీ నాయకుడు గణేష్ ముదిరాజ్ తదితరులు మాట్లాడుతూ.. మారుతీ మిత్ర మండలి ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మిత్రుల మధ్య అనుబంధాలను పెంచడంతోపాటు సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కోట్‌పల్లిలో ఎస్ఐ మీనాక్షి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్

**హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై వాహనదారులకు అవగాహన**



**కోట్‌పల్లి, అక్టోబర్ 24(జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణ, వాహన దారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కోట్‌పల్లి ఎస్ఐ మీనాక్షి ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అవసరమైన వాహన పత్రాలు కలిగి ఉండాలని ఎస్ఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, దీనివల్ల ప్రాణనష్టం సంభవించడంతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని వివరించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, వాహనం నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం బాధ్యతగా భావించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిబంధనలు ఉల్లంఘించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని వాహనదారు లకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతా యుతంగా వాహనాలు నడపాలని, తమ కుటుంబాల భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకోవా లని ఎస్ఐ మీనాక్షి సూచించారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అవ గాహన కలిగి ఉండాలని, నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.



# విద్యార్థుల్లో సృజనాత్మకతకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం

**ప్రధానోపాధ్యాయుడు రాములు**

**నాగారం ప్రభుత్వ పాఠశాలలో ఆర్ట్ అండ్ కల్చర్ కార్యక్రమాలు**

**కీసర, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** విద్యార్థుల్లో సృజనాత్మకత, అంతర్గత ప్రతిభ వెలుగులోకి వస్తాయని నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు అన్నారు. శనివారం నాగారం డివిజన్ పరిధిలోని నాగారం పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు ఆర్ట్ అండ్ కల్చర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు, పాటలు, పద్యాలు, కథా పఠనం, స్కిట్లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అరవింద్ కుమార్, శ్రీదేవి, సుమతి, మాలోత్ నాయక్, వందన, వరమ్మ, అజీజ్ అహ్మద్, రఘు, అర్చన, సంజయ్, రాణి, సరిత, గాయత్రి, సుప్రజ, విద్యా వాలంటీర్లు స్వప్న, పావని, పవిత్ర, విశాలి, దివ్య, పద్మ, కార్యాలయ సిబ్బంది సౌజన్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

